
# ఇతితే జ్ఞాన మాఖ్యాతం...

కె. మురళీకృష్ణ



ఆడిటోరియం చప్పట్లతో మారుమోగి పోతోంది. అందరి కళ్లూ ఠీవిగా వేదిక పైకి దారి తీసే మెట్లెక్కుతున్న నీరజ పైనే ఉన్నాయి. భారతీయ విజ్ఞాన శాస్త్రానికి అంతర్జాతీయంగా గుర్తింపు లభింప చేసిన విజ్ఞాన శాస్త్రవేత్త నీరజ. రాష్ట్రపతి నుండి బహుమతి అందుకునేందుకు వేదికను చేరింది. రాష్ట్రపతి అభినందన పూర్వకంగా నవ్వారు. ఆప్యాయంగా పరామర్శించారు. ఫ్లాష్ బల్బుల మెరుపులు ఆకాశం ఆనందంతో మెరుస్తోందా అనిపించేట్టున్నాయి. రాష్ట్రపతి నుండి బహుమతి అందుకుని మైక్ వద్దకు నడిచింది. హాలు నిశ్శబ్ద మయింది. అందరూ ఆతృత'గా ఎదురు చూస్తున్నారు నీరజ ఏం చెపుతుందో నని!



నీరజ మైకు దగ్గర చేరింది. ప్రేక్షకులను చూసి చిరునవ్వు నవ్వింది. "ఈనాడు నే నీ బహుమతిని అందుకుంటున్నా నంటే కారణం ఒకే ఒక వ్యక్తి. అనుక్షణం నా వెంట ఉంటూ, నన్ను ప్రోత్సహిస్తూ లక్ష్యం వైపు సాగిపోయేట్టు చేసిన వ్యక్తి. ఆయన పేరు రవిచంద్ర." ముందు వరుసలో కూచున్న రవిచంద్ర వైపు చూసింది నీరజ.

రవిచంద్ర కళ్ళు భావ రహితంగా ఉన్నాయి. అతని కళ్లలో గతం తాలూకు స్మృతులు నీటి వెల్లువలై ఊరుతున్నాయి.

డిగ్రీ పూర్తయి, కంప్యూటర్ డి.సి.ఎ. కాగానే రవిచంద్రకు డాటా పాయింట్ కంప్యూటర్ సెంటర్‌లో ఇన్‌స్ట్రక్టర్ ఉద్యోగం దొరికింది. వేరే మంచి ఉద్యోగం దొరికే వరకూ ఈ ఉద్యోగంలో సమయం గడవ వచ్చని అనుకున్నాడు.

నీరజ ఆ ఇన్‌స్టిట్యూట్‌లో అతని విద్యార్థిని. ఆ తరగతిలో తెలివైన దానిగా గుర్తింపు పొందింది. కోర్సు పూర్తయిన తరువాత నీరజ అదే ఇన్‌స్టిట్యూట్‌లో ఇన్‌స్ట్రక్టర్‌గా చేరింది. అంటే రవిచంద్ర, నీరజ అధ్యాపక, విద్యార్థినుల దశ దాటి సహోద్యోగుల స్థితికి చేరుకున్నారు.

ఒక రోజు రవిచంద్ర నీరజ పాఠం చెప్తూంటే విన్నాడు. ఆమె పాఠం చెప్పే పద్ధతి అతనికి నచ్చింది. స్టాఫ్ రూంలో ఆమె కలిసినప్పుడు ఇదే మాట చెప్పి అభినందించాడు.

నీరజ కృతజ్ఞతలు చెప్తూ అంది - "నే నింత బాగా చెప్ప గలగటానికి కారణం మీరే. నేను మిమ్మల్ని అనుకరిస్తూ పాఠాలు చెప్తాను."

అప్పుడు మొట్ట మొదటిసారిగా నీరజను గమనించాడు రవిచంద్ర. అతని హృదయంలో మెరుపులు మెరిశాయి. ఇన్నాళ్లూ మామూలు యువతిలా కనిపించిన నీరజ విరిసిన పూవులా కనిపించింది. ఆమె రూపం అతని మదిలో కలవరం కలిగించింది.

మధ్యాహ్నం లంచ్ సమయంలో స్టాఫ్ రూంలో రోజూ ఇద్దరే ఉండే వారు. ఎవరు తెచ్చుకున్న ఫలహారాన్ని వారు తిని ఏదో చదువుకుంటూ ఉండేవారు. చిరునవ్వులకు మించి వారు తమ పరిధిని దాట లేదు. ఒక రోజు రవిచంద్ర ఫలహారాన్ని తెచ్చుకోలేదు. అది చూసి "మీ రీ వేళ ఫలహారాన్ని తెచ్చుకో లేదేం?" అడిగింది నీరజ.

"అమ్మ ఆరోగ్యం బాగాలేదు. అందుకని టిఫిన్ తయారు కాలేదు. అదీ కాక అమ్మ ఆరోగ్యం బాగా లేకపోతే నాకు తినబుద్ధి కాదు" అన్నాడు రవి.

" అదేమి టండీ! అన్నం తినకపోతే నీరసం వస్తుంది. రండి, నా టిఫిన్ ఇద్దరం వంచుకుని తిందాం" అంది నీరజ.

"ఫరవాలేదు. మీరు కా నివ్వండి." మొహమాటంగా అన్నాడు రవి.

"ఏమిటీ ఫరవాలేనిది? తీసుకోండి." తన టిఫిన్‌లో సగ భాగం తీసి రవిచంద్రకు ఇచ్చింది.

వ ద్దంటూనే తిన్నాడు.

టిఫిన్ పూర్తి కాగానే అవతలకు వెళ్లి అరటి పళ్లు తెచ్చాడు. ఇద్దరూ కలసి తిన్నారు.

ఆ రోజు నుంచీ రోజూ ఇద్దరూ టిఫిన్ పంచుకు తినటం ఆరంభించారు. రవిచంద్ర తనకు తెలియకుండానే ప్రతి రోజూ లంచ్ కోసం ఆత్రుతగా ఎదురు చూసే వాడు. మాటల సందర్భంలో ఒకరి కుటుంబ వివరా లొకరికి తెలిశాయి.

నీరజది సంపన్న కుటుంబం. నీరజ తండ్రి బాంక్ మేనేజర్. ఆమె అన్నయ్య మంచి ఉద్యోగంలో ఉన్నాడు. రవిచంద్ర తండ్రి చిన్నప్పుడే పోయాడు. వా ళ్లమ్మే పెంచి పెద్ద చేసింది.

ఓ రోజు నీరజ తెలుగు నవల చదవటం చూసి "మీరు తెలుగు నవలలు చదువుతారా?" వెక్కిరింతగా అడిగాడు.


"మీరు చదవరా?" ఎదురు ప్రశ్న వేసింది నీరజ.

"నాకు మన తెలుగు నవలలు బో రనిపిస్తాయి. మన వాళ్ల కసలు రాయటం రాదు. ఎంత సేపూ ప్రేమల పరిధి దాటి మన నవలలు ముందుకు రావు. ఆ రడుగుల హీరో, రంగుల కారు, బంగారు కలల యుగమై పోయింది. తరువాత సైంటిఫిక్ వివరణలతో కూడిన దయ్యాల కథలు, డిటెక్టివ్‌లు, హత్యల కథలు మొద లయ్యాయి. ఇప్పు డసలు నవలలు ఎవరికి తోచినట్టు వారు రాసేస్తున్నారు. తుపాకీ మొహం చూడని వాళ్లు కూడా మాఫియా ముఠాలతో మర్డర్ల కథలు రాసేస్తున్నారు. ఏమీ తోచక ఎవరికి వారు తమ తీరని ఊహల కోరికలను శృంగార నవలలుగా వచ్చి బూతు సాహిత్యం రూపంలో దింపుతున్నారు.

"ఒక్క రచయితలో కూడా సమాజ మనీ, నైతిక విలువ లనీ, మని షనీ, మానవత్వ మనీ ఆలోచన లున్నట్టు కనిపించదు. ప్రతి వ్యక్తిలో సున్నిత భావా లుంటాయనీ, నిద్రాణమై ఉన్న ఆ సున్నిత భావాలను తట్టి లేపేటట్టు, అతనిలో స్పందన కలిగేటట్టు రాయాలన్న తపన ఒక్క రచయితలో

కనిపించటంలేదు. చిరకాలం నిలిచే విలువ లున్న సాహిత్యం సృష్టించాలన్న తాపత్రయం లేదు. ఎంత సేపూ పాశ్చాత్య సృజనాత్మకతపై ఆధారపడి, ఎవరు ముందు అనువదిస్తే వాడే గొప్ప అని ప్రకాలర్లెగరేయటం తప్ప కష్టపడి స్వకపోల కల్పితం ఏదైనా చేద్దామన్న ధ్యాస లేదు. ప్రతి వాడికీ ఏదో ఒకటి సంచలనాత్మకంగా రాసేసి, పేరు సంపాదించి సినిమాల్లో కెళ్లిపోయి డబ్బు గడించాలన్న ఆశ తప్ప ఇం కోటి కనిపించదు. అందుకే అద్భుతమైన 'ఒరిజినల్' ఆంగ్ల సాహిత్యం ఉండగా చెత్త అనువాదాలు చదవటం దండుగ అని తెలుగు సాహిత్యం జోలికే పోను నేను." గర్వంగా చూశాడు నీరజ వైపు.

తిరస్కారంగా చూసింది నీరజ. "మాతృ భాషపై గౌరవం లేని మీ వంటి విద్యావంతుల వల్లే మనం ఈ పరిస్థితిలో ఉన్నాం. కొన్ని విషయాల్లో మీతో నేనూ ఏకీభవిస్తాను. కానీ కేవలం విమర్శించటంతో మీ బాధ్యత తీరిపోదు. మనం సంధి యుగంలో ఉన్నాం. ప్రస్తుతం సమాజంలో మార్పుని బట్టీ నైతిక విలువలు మారతాయి. జీవన సరళి మారుతుంది. సాహిత్యం కూడా అందుకు తగ్గట్టుగానే మారుతుంది. ఇప్పు డొస్తున్న సాహిత్యం నచ్చట్లేదని మాత్రం తెలుగు సాహిత్యాన్ని చులకన చేయటం మీలో దా గున్న న్యూనతా భావానికి నిదర్శనం. ఇప్పుడూ మంచి విలువైన రచన లొస్తున్నాయి. వాటిని వెతికి పట్టుకోవటం పాఠకుడి బాధ్యత. పాఠకుల ప్రోత్సాహమే రచయితకు ఊపిరి. తెలుగులో ఎంతో అద్భుతమైన సాహిత్యం ఉంది. పానుగంటి, చిలకమర్తి, విశ్వనాథ, అడవి బాపిరాజు - ఇలా ఎందరో గొప్ప రచయిత లున్నారు. మీ పాశ్చాత్య రచయితలకు ఏమాత్రం తీసిపోరు. వారి కన్నా ఓ మెట్టు పైనే ఉంటారు."




"అబ్బా! అవన్నీ విను గండీ."

"మంచి పుస్తకాలు కావా లంటారు. మంచి పుస్తకం చదవ మంటే విను గంటారు. ఒక మంచిని సాధించాలంటే సాగర మథనం తప్పదు. అవసరమైతే హాలాహలాన్ని కూడా భరించాలి. ప్రస్తుతం తెలుగు సాహితీ సముద్ర మథనంలోంచి హాలాహలం జనిస్తోంది. అమృతం ఉద్భవించే రోజు దగ్గరలోనే ఉంది. ఇప్పటి ఈ నవలల ధోరణి ఎక్కువ రోజులు ఉండదు. కొన్ని రోజుల తరువాత వా టంతట అవే కనుమరగయి పోతాయి." ఆవేశంగా అంది నీరజ.

రవిచంద్ర ఏమీ మాట్లాడలేదు. కానీ ముగ్ధు డయిపోయాడు. అతనికి నీరజ పట్ల గౌరవం పెరిగింది. రవిచంద్రకు తెలియకుండానే నీరజ అంటే ఇష్టం ఏర్పడసాగింది. ఎవరైనా అమ్మాయి కనబడితే నీరజతో పోల్చేవాడు. అందరూ నీరజ ముందు ఓడిపోయే వారు. ఎప్పుడూ నీరజదే పై చేయి అయ్యేది. ఓ రోజు నీరజను ఇంటికి ఆహ్వానించాడు. ముందు సందేహించినా తరువాత అంగీకారం తెలియజేసింది.

రవిచంద్ర అమ్మ సరోజినీ దేవికి నీరజ నచ్చింది. నీరజ రవిచంద్ర గదిలో పుస్తకాలు చూసింది. అన్నీ సాహిత్యానికి సంబంధించినవే. ఒక అర నిండా ఆంగ్ల సాహిత్యం, మరో అర నిండా తెలుగు సాహిత్యం పుస్తకాలు ఉన్నాయి.

"ఇంట్లో ఇన్ని తెలుగు పుస్తకా లుంచుకుని ఆ రోజు అలా వాదించా రేమిటి? మీ దగ్గరున్న పుస్తకాలు చూస్తుంటే మీరు విశ్వనాథ వారి అభిమానిలా ఉన్నారు?" అడిగింది నీరజ.

"విశ్వనాథ నా ఆరాధ్య దైవం. మన సాహిత్య కారుల్లో భూతకాలంపై అవగాహన, వర్తమానంపై ఆవేదన, భవిష్యత్తు గురించి ఆలోచన ఉన్న ఏకైక సాహిత్యకారు డాయన. మన దురదృష్టం ఆయన సమకాలికులకు ఆయన అర్థం కాలేదు. నేను తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ఎన్నో పుస్తకాలు చదివాను. ఇతర భాషల పుస్తకాల అనువాదాలు చదివాను. మనసుని కదిలించిన గొప్ప పుస్తకా లెన్నో ఉన్నాయి. కానీ విశ్వనాథ వారిలా నన్ను కదిలించ గల రచయిత నాకు ఎక్కడా కనబడలేదు."

"భలే వారే! ఆ రోజు నాకు తెలియకుండా మీ ముందు ఏదో వాగేశాను." సిగ్గుపడింది నీరజ.

నీరజను బస్ ఎక్కించటానికి ఇంటి నుంచి బస్ స్టాప్ దాకా ఆమెతో నడుస్తూ వెళ్లటం రవిచంద్రకు అద్భుతంగా అనిపించింది. అందమైన అమ్మాయి, చల్లని సాయంత్రం, మెల్లగా వీస్తున్న చిరుగాలి... ఇంతకన్నా 'రొమాంటిక్ సెట్టింగ్' ఏముంటుంది! ఆ మూడ్‌లో ఉన్న రవిచంద్రకు పక్క నుంచే దూసుకుపోతున్న వాహనాలు, అవి వదులుతున్న ఇంధనాలు, రణగుణ ధ్వనులు ఏవీ వినిపించటం లేదు.

ఎవరో యువకుడు నీరజకు ఎదురుగా వచ్చి డాష్ ఇవ్వటంతో ఈ లోకంలో పడ్డాడు రవిచంద్ర. వాడు డాష్ ఇచ్చి 'సారీ' అని వెళ్లి పోబోయాడు. రవిచంద్ర కోపంగా వాడిని ఆపాడు. వాడు నిర్లక్ష్యంగా 'సారీ అన్నానుగా' అన్నాడు. రవిచంద్ర కేం చేయాలో తోచలేదు.

నీరజ రవిచంద్రను వారించి చేయిపట్టుకు లాగింది. "అటువంటి వాళ్లతో వాదించి లాభం లేదు" అంది.

"వాడు కావాలనే చేశాడు. దాని వల్ల ఏం ఆనందం అనుభవిస్తాడో తెలియదు గానీ వాడు చేసిన పని అసహ్యకరమైనది. స్త్రీ లంటే విలువ లేదు. స్త్రీ, పురుష సంబంధ మంటే గౌరవం లేదు. అయిదేళ్ల పిల్లవాడి నుంచి ప్రతి వాడూ స్త్రీని అదో రకంగా చూడటం చికాగ్గా, అసహ్యంగా ఉంటుంది." రవిచంద్ర కింకా ఆవేశం తగ్గలేదు.

"అనవసరంగా ఆవేశపడి లాభం లేదు. ఎంత మంది సని సంస్కరిస్తారు? వారు అలా ప్రవర్తించటానికి గల కారణాలను అర్థం చేసుకుని జాలి పడండి. అనవసరంగా ఆవేశపడకండి." సౌమ్యంగా చెప్పింది నీరజ.

నీరజను బ స్సెక్కించి ఇంటి కొచ్చిన తరువాత నీరజ ఆలోచనలు రవిచంద్రను చుట్టుముట్టాయి. భోజనా లయిన తరువాత పిల్లిలా అమ్మ దగ్గరకు చేరాడు.

"నీరజ నీకు నచ్చిందా అమ్మా?"

నచ్చిం దన్నట్టు త లూపింది సరోజినీ దేవి.

"నాకు నీరజ ఎంతో నచ్చిం దమ్మా. నేను నీరజను పెళ్లి చేసుకుంటే ఎలా ఉంటుంది?" మనసులో మాట బయట పెట్టాడు.

"బాగానే ఉంటుంది. నా కేమీ అభ్యంతరం లేదు. కానీ నీరజను కనుక్కున్నావా?"

"ఇంకా అడగలేదు. తెలుసుకుంటాను."

"ఒక విషయం గుర్తుంచుకో. నీరజ తల్లిదండ్రులు కూడా ఇష్టపడేలా చూడు. ఎందుకంటే కూతురి కెంత వయ సొచ్చినా తల్లిదండ్రులకు తమ సంతానం ఇంకా చిన్న పిల్ల ల్లాగే కనిపిస్తారు. తమ కేం కావాలో పిల్లలు నిర్ణయించుకోలే రనుకుంటారు. అదీ కాక తమ కూతురి కెటువంటి భర్తను తేవాలో అని ఎంతో ఊహించుకుంటూంటారు. అందుకే జాగ్రత్త, వారు కూడా ఇష్టపడితే మంచిది" అంది.

తరువాత ఆఫీసులో నీరజను కలిశాడు. "నీరజా! ఇవాళ సాయంత్రం ఆఫీ సయిన తరువాత ఏ మయినా పని ఉందా?" అడిగాడు.

"లేదు" అంది.

"మీకు అభ్యంతరం లేకపోతే నేను మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి." ఆ మాటలు వినటం తోటే నీరజ నిటారుగా అయింది.

"ఏ విషయం?"

"సాయంత్రం తీరికగా చెప్తాను." రవిచంద్రకు మేఘాల షికారు తేలుతున్నట్లే ఉంది. సాయంత్రం కోసం ఆత్రుతగా ఎదురు చూశాడు. ఆఫీసు అయిపోగానే ఇద్దరూ కలిశారు. 'ట్యాంక్ బండ్ వెళ్దాం' అన్నాడు రవి. తనే ఆటోని పిలిచాడు. ఇద్దరూ ట్యాంక్ బండ్ చేరారు. అక్కడ గడ్డిపై

కూర్చున్నారు.

"చెప్పండి!" అంది నీరజ.

రవిచంద్ర నోరెండిపోయింది. అంత వరకూ ఏం చెప్పాలో, ఎలాచెప్పాలో మనసులో ఎన్నో మార్లు రిహార్సల్సు వేసుకున్నాడు కానీ అసలు సమయం వచ్చే సరికి మెదడు ఖాళీ అయిపోయింది.

ఏదో ఒకటి మాట్లాడటం మొదలు పెడితే కానీ లాభం లేదని మాట్లాడటం ఆరంభించాడు.

"నీరజా! నాకు మీ రెంతో నచ్చారు. ప్రేమ అన్న పదం నేను వాడను. ఎందుకంటే నా కా పదం ఇంకా సంపూర్ణంగా అర్థం కాలేదు. కానీ అనుక్షణం నాకు నీ ఆలోచనలే వస్తుంటాయి. నిన్ను చూస్తుండాలనీ, నీతో మాట్లాడాలనీ, నీ ఊహలను తెలుసుకోవాలనీ, నీ కష్ట సుఖాల్లో పాలుపంచుకోవాలనీ, నీ కోరికలు నెరవేర్చి నిన్ను ఆనందపరచటం ద్వారా నన్ను నేను ఆనంద పరచుకోవాలనీ ఉంటుంది.

"నా భావాలు నాకే స్పష్టంగా అర్థం కావటంలేదు. శేషేంద్ర శర్మ కవితలు నా కోసమే రాసినట్లు అనిపిస్తాయి. నిన్ను 'విధి నా యెదపై విసిరిన ఎర్ర గులాబీ!' అనుకోనా? 'అదృష్ట తీరాల నించి అవతరించి, నా నేత్రాంచల సీమల్లో ఇంద్ర ధనువులా విరిసిన కలా!' అననా? నీవు 'ఒక అనిర్వచనీయ క్షణంలో, నా కోటి నాడుల దారుల్లో విరిసిన సౌందర్య రసానుభూతివి' అననా? నీరజా! ఇంత వరకూ ఏ స్త్రీని చూసి నే నింతగా స్పందించలేదు."

రవిచంద్ర నరనరాల్లో ఏదో తెలియని ఉద్వేగం కలుగుతోంది. అతనికి తన మదిలోని ఆలోచనలన్నీ నీరజకు ఒక్కసారే చెప్పెయ్యా లన్న ఆవేశం కలుగుతోంది.

"నీరజా! నా దృష్టిలో స్త్రీ భగవంతుడి అపురూప సృష్టి. స్త్రీ ప్రకృతికి ప్రతీక. ప్రస్తుతం ప్రపంచంలోని స్త్రీ లందరికీ ప్రతీకగా నా జీవితంలోకి నువ్వు ప్రవేశించావు. నాకు నిన్ను వదులుకోవాలని లేదు. నీకు దూర మవాలని లేదు. నీతో కాకుండా ఇం కే స్త్రీతో కూడా నేను నా జీవితాన్ని ఊహించలేకుండా ఉన్నాను. అయితే నేను నిన్ను ఇష్టపడ్డంతగా, నువ్వు నన్ను ఇష్టపడాలని లేదు. నిర్మొహమాటంగా నీ మనసులో మాట ఉన్నది ఉన్నట్లు చెప్పు."

మనసులో మాటలు బయటకు రాగానే ఎంతో తేలికయిపోయిన భావన కలిగింది రవిచంద్రకు. నీరజ తల వంచుకుని కూచుని ఉంది. తీర్పు కోసం ఎదురు చూస్తున్న ఖైదీలా ఉంది రవిచంద్ర పరిస్థితి. కొద్ది క్షణా లిద్దరూ మౌనంగా ఉన్నారు.

నీరజ త లెత్తింది. రవిచంద్ర కళ్ళల్లోకి సూటిగా చూసింది. రవిచంద్ర తల వంచుకున్నాడు.

"స్త్రీ పురుషులు ఇద్దరూ కాస్త సన్నిహితంగా ఉన్నారంటే ఈ ప్రశ్న త లెత్తక మానదని నాకు తెలుసు. మీ మగవాళ్ళు ప్రతి స్త్రీని చూసి 'ఈమేనా నా ప్రేయసి?' అని అనుకున్నట్లుగా స్త్రీలు అనుకోరు. ఒక స్త్రీ తన హృదయాన్ని బహిర్గతం చేయాలంటే ఆ పురుషుడు ఎంతో సన్నిహితంగా వస్తే తప్ప సాధ్యం కాదు. మీరు నాకు నచ్చారు. మీలో సంస్కారం ఉంది. మీ సున్నితత్వం, ఎదుటి మనిషిని అర్థం చేసుకోవటం, మీ ఆలోచనలు, మీ విజ్ఞానం వంటి విషయాలు నాకు నచ్చాయి. మీకు నేను నిజంగా నచ్చితే, నిజంగా మీరు నాతో మీ ఆశలను, ఆశయాలను పంచుకోవాలని అనుకుంటే మీరు ఎవరితో మాట్లాడాలో నేను చెప్ప నవసరం లేదు" అని చెప్పి లేచింది నీరజ.

రవిచంద్ర కదలలేదు. నీరజ కదలి వెళ్ళిపోయింది.

ఆ రా త్రంతా రవిచంద్ర నీరజ నాన్న గారితో ఏం మాట్లాడాలి, ఎలా మాట్లాడాలి అని ఆలోచిస్తూ గడిపాడు. మరునాడు ఆఫీసులో ఏకాంతం దొరకగానే నీరజను అడిగాడు - "నీరజా! నే వంటే నీకు ఇష్టమేనా?" అని.

నీరజ మౌనంగా ఉంది. మరో సారి రెట్టించి అడిగాడు. నీరజ 'ఇష్టమే' నని అస్పష్టంగా పలికింది. రవిచంద్ర హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. నీరజను దగ్గరకు తీసుకుందా మన్న కోరికను అతి కష్టం మీద అణచుకున్నాడు. ఒక అమ్మాయి ఒక అబ్బాయితో అత నంటే తనకు ఇష్టమని చెప్పిన క్షణం ఆ అబ్బాయి జీవితంలో మరపురాని మధుర క్షణాల్లో అరుదైన అద్భుత క్షణంగా మిగిలిపోతుంది.

నీరజ ఇల్లు గుర్తు పట్టటం కష్ట మేమీ కాలేదు. తలుపు తట్టాడు. కణతలు పగిలి ముక్క లవుతా యేమోనన్నంత వేగంగా అదురుతున్నాయి. నీరజ తలుపు తెరిచింది. పలకరింపుగా నవ్వి "రండి, కూర్చోం డ"ని సోఫా చూపించి లోపలకు వెళ్ళిపోయింది. గది నిండా ఐశ్వర్యం ఉట్టిపడుతోంది. నీరజ నిరాడంబరత్వానికి ఆ గది ఆడంబరాన్ని అన్వయించుకోలేక పోయాడు. ఆయనను నీరజ తండ్రిగా సులభంగా పోల్చుకోవచ్చు. అన్నీ నీరజ పోలికలే.

లేచి "నమస్కార మండీ" అన్నాడు.

ప్రతిగా ఆయన "కూచోండి" అన్నారు.

"నా పేరు రవిచంద్ర. నేను - నీరజ కొలీగ్స్" చెప్పాడు రవి.

"నీరజ చెప్పింది" అన్నా డాయన.

కా స్సేపాగి "మీ నాన్న గారు...." అన్నా రాయన.

"నాన్న గారు నా చిన్నతనంలోనే పోయా రండీ."

"అలాగా మరి నీ ఆలనా.... పాలనా..."

"అన్నీ అమ్మే చూసిం దండి."

"ఏం చదివావు?"


ఇ దేదో ఇంటర్వ్యూలా ఉం దనుకున్నాడు.

"నేను కంప్యూటర్ డిప్లొమా చేశాను. • ఎంసిఎ చేద్దా మనుకుంటున్నాను."

"ఏ మాత్రం ఆస్తి ఉంది?"

"ఆ స్తేమీ లే దండి. నాకు, అమ్మకు వచ్చే జీతం తప్పించి,...."

మాటల మధ్యలో 'నీరజా! కాఫీ తీసుకురా!' అని కే కేశా రాయన. రవి మౌనంగా ఉండిపోయాడు. పక్క గది గుమ్మం పరదా కదిలింది. నీరజ కాఫీ తెచ్చి టేబిల్ మీద పెట్టింది. 'తీసుకోండి' అన్నా డాయన.




రవిచంద్రకు విషయం ఎలా ప్రస్తావించాలో తెలియటం లేదు. ఆయన ఓ ఇంటర్వ్యూ తీసుకుని వదిలేశారు. నీరజ వైపు చూశాడు. రవిచంద్ర వైపే చూస్తున్న నీరజ కళ్ళు తిప్పుకుంది. అక్కడ నుంచి లోపలకు వెళ్ళిపోయింది. ఇక అడిగెయ్యా లనుకుని సిద్ధ మవుతుండగా ఆయనే అన్నారు.

"నీరజ కో సంబంధం కుదిరేట్టుం దోయ్! అబ్బాయి ఇంజనీయర్. ఎన్.ఎఫ్.సి.లో ఉద్యోగం. మంచి సంప్రదాయమైన కుటుంబం. అబ్బాయి నాన్న గారు రిటైర్డ్ జడ్జి. వాళ్ళు అయిదు లక్ష లడుగుతున్నారు."

రవిచంద్రకు తన ఆశా సౌధం ఒక్క చిరుగాలి తాకిడికే కూలిపోతున్నట్లనిపించింది. హీన స్వరంతో కళ్ళ నీళ్ళు తిరుగుతూంటే అన్నాడు - "నేను నీరజను పెళ్ళి చేసుకోవా లనుకుంటున్నాను" అని.

ఆయన రవిచంద్ర వైపు జాలిగా చూశారు.

"చూడు బాబూ! ఈ సంబంధం దాదాపుగా నిశ్చయమై పోయినట్లే. నాకు నీరజని డాక్టర్‌కో, ఇంజనీయర్‌కో ఇవ్వాలని ఉండేది. అనుకున్నట్లుగానే మంచి సంబంధం దొరికింది. నువ్వింకా జీవితంలో ఏమీ చూడలేదు. నేను ఎంతో అనుభవంతో చెప్తున్నాను. ఈ ప్రేమలు గీమలు అంతా మనం





కల్పించుకున్న భ్రమలు. ఇ దో పెద్ద భ్రాంతి. అంతా మానసికం. మనసు మనం చెప్పిన మాట వినాలి కానీ, మనస్సెటు_ పరిగెత్తితే మనం అటు పరుగెత్త కూడదు.

_"నువ్వంటున్న ప్రేమ లన్నీ డ బ్బుంటేనే నిలబడతాయి. డబ్బు లేకపోతే భార్య భర్తని త్యజించటానికి వెనుకాడదు, కొడుకు తల్లిదండ్రులను తృణంగా తీసి పా రెయ్యటానికీ జంకదు. జరిగిం దేదో జరిగింది. అవన్నీ మరచిపోయి అనవసర భావోద్వేగాలకు లోనుకాకుండా శాంతంగా ఆలోచించు" అన్నా రాయన.

రవిచంద్ర పరిస్థితి తుఫాను తాకిడికి కొట్టుకునే చిగురు టాకులా ఉంది. "నేను డబ్బు, సంప్రదాయం ప్రసక్తి తేవటం లే దండి. మే మిద్దరం కలసి జీవించాలని నిశ్చయించుకున్నాం. ఇద్దరి మనసులు కలసిన తరువాత...." రవిచంద్ర మాటలకు అడ్డొచ్చా రాయన.

"కలసి జీవించాలని నిశ్చయించుకున్నారా? నీరజా! ఇలారా!" పిలిచారు.

తల వంచుకుని నీరజ గదిలోకి వచ్చింది. "నీరజా! మీ రిద్దరూ ఒకరి నొకరు ఇష్టపడ్డారా? కలసి జీవించాలని నిశ్చయించారా? అయితే మీ ఇష్టానికి అడ్డురాను. కానీ ఈ క్షణం నుంచే నీకూ, నాకూ సంబంధం ఉండదు. చెప్పు?" తీవ్రంగా అడిగా రాయన.

నీళ్లు నిండిన కళ్లతో రవిచంద్ర వై పొకసారి చూసింది. ఏమీ మాట్లాడకుండా లోపలకు పరుగెత్తి వెళ్లిపోయింది. ఆయన లేచి నిలబడ్డారు. రవిచంద్ర కూడా లేచి నిలబడ్డాడు.

"చూశావుగా! నీ మీద మా అమ్మాయికి ఎటువంటి ఇష్టమూ లేదు. నీరజ ఇంకా చిన్న పిల్ల. దానికి లేని పోని ఊహలు కల్పించకు. గుడ్‌బై అండ్ గుడ్ లక్" అని మరో మాటకు అస్కార మివ్వకుండా లోపలకు వెళ్లిపోయా రాయన.

రవిచంద్ర కంతా అయోమయంగా ఉంది. చెవుల్లో సప్త సముద్ర తరంగాల ప్రళయ ఘోష. తల తిరిగిపోతోంది. కడుపులో వికారంగా ఉంది. అంతా శూన్యంగా అనిపిస్తోంది.

'ఇదేనా ప్రేమ అంటే? ఇంతేనా ప్రేమకు ఫలితం? ఇష్టపడిన అమ్మాయి లభించకపోతే పడే వేదనేనా ప్రేమకు జ్ఞాపకం? ఇద్దరూ ఒకరి నొకరు ఇష్టపడ్డారు. కలసి జీవించా లనుకున్నారు. దానికి ఇంత హంగామా ఎందుకు? ఇన్ని అడ్డంకు లెందుకు? స్త్రీ - పురుష సంబంధ ప్రాకృత్రికం. ప్రతి హృదయం మరో హృదయాన్ని వాంఛిస్తుంది. ఇరు హృదయాలు పరస్పర వాంఛాబంధితులయిన తరువాత ఈ పెద్ద వాళ్ల అ డ్డేమిటి? నీరజ నాన్న గారు ఇష్టపడనందుకు నీరజ తన జీవితంలోంచి నిష్క్రమించి నట్టేనా? ఇక నుంచి నీరజ తన కేమీ కాదా? నీరజ చిరునవ్వు, ఆనందం తనవి కావా? తనకు తెలియకుండానే తనలో నీరజ అంటే ఇంత అభిమానం, ఆప్యాయతలు ఎలా కలిగాయి? ఈ నిరాశ, ఆవేదన లేమిటి?'

రవిచంద్ర పిచ్చి పట్టిన వాడిలా ఊ రంతా తిరిగాడు. ఇల్లు చేరే సరికి రాత్రి పన్నెండయి పోయింది. అమ్మ పడక కుర్చీలోనే నిద్రపోయింది. 'ఎదురు చూస్తూ అలాగే పడుకున్న దన్నమాట' అనుకున్నాడు. తన గదిలోకి వెళ్లాడు.

ఇక భవిష్యత్తులో ఏ అమ్మాయినీ తను ఇష్టపడలే ననిపించింది. నీరజ ధైర్యం చేసి వాళ్ల నాన్న ముందు త నంటే ఇష్టమని చెప్పి ఉంటే ఎంత బావుండేది! నీరజ తనని మోసం చేసింది. ఎందు కిలా చేసింది? కడుపులో వికార భావన ఎక్కు వయింది. వాంతి వొస్తుం దనిపించింది. బాత్‌రూమ్ వైపు వెళ్దామని అడుగు వేయబోయాడు. అలాగే కళ్లు తిరిగి పడిపోయాడు.

కళ్లు తెరిచే సరికి ఎదురుగా అమ్మ కనిపించింది. అమ్మను చూడగానే కళ్లల్లో నీ ళ్లొచ్చాయి. దుఃఖం వరదలుగా పొంగింది. నెమ్మదిగా వెక్కిళ్ల మధ్య జరిగిన దంతా చెప్పాడు. "చూ డమ్మా! ఇక్కడ మనను అనే దానికి ప్రాముఖ్యత లేదు. ఇంజనీయరే కావాలట. డ బ్బుంటే అన్నీ సరిపోతాయా? అంత డ బ్బుంటే లక్షల కొద్దీ కట్నం ఎందుకు? డబ్బు కెందుకు ఇంత ప్రాముఖ్యత నిస్తారు? నా కసలు బ్రతకాలని లే దమ్మా. నీరజకు నేను ఇష్టమే నని చెప్పే ధైర్యం లేదు. నీరజ నన్ను మోసం చేసింది" అన్నాడు.

"ఇప్పుడు నీ కేం చెప్పినా అర్థం కాదు. ముందు నీ ఆరోగ్యం బాగు కావాలి. ఆ తరువాత నీ కన్నీ చెప్తాను" అంది సరోజినీ దేవి.

రవిచంద్రకు హఠాత్తుగా ఒక ఆలోచన వచ్చింది. నీరజ వాళ్ల నాన్న గారి ముందు నిజం చె ప్పేందుకు భయపడి ఉండవచ్చు. ఒంటరిగా ఆఫీసులో కలసి తనతో వచ్చెయ్య మంటాడు. ఒప్పుకుంటుంది. ఆ ఆలోచన ఎంతో బలా న్నిచ్చింది. త్వరత్వరగా కోలుకున్నాడు. ఆఫీసుకి వెళ్లాడు.

నీరజ రాజీనామా చేసిందని తెలిసింది. ఇంటికి ఫోన్ చేశాడు. ఊళ్లో లేదని తెలిసింది. రవిచంద్ర అత్రుత పట్టలేక పోతున్నాడు. తను నీరజని కలవటమే తరువాయి, నీరజ తనతో వచ్చేస్తుందని ఊహిస్తున్నాడు. ఈ మధ్యలో ఓ.ఎన్.జి.సి. నుంచి ఇంటర్వ్యూ వచ్చింది. అమ్మ పోరు భరించలేక ఇంటర్వ్యూ కెళ్లి వచ్చాడు. వా ళ్లేమడిగారో? ఇత నేమి చెప్పాడో? ధ్యాస అంతా నీరజ మీదే. దారిలో ఏ అమ్మాయి కనబడినా నీరజలాగే కనిపించేది. దగ్గర కొస్తే చూసి 'ఈమె నీరజ అని ఎలా అనుకున్నానో' అని ఆశ్చర్యపోయేవాడు.

ఓ రోజు ఆఫీసులో నీరజ కనిపించింది. పరుగు పరుగున వెళ్లి 'నీరజా! నీతో మాట్లాడాలి' అన్నాడు. నీరజ అతని వంక చూసింది. పూర్తిగా చిక్కిపోయి ఉంది. కళ్ల క్రింద నల్లని చార లున్నాయి. జబ్బు పడి లేచి నట్టుంది.

ఏకాంతం దొరకగానే అడుగాడు. "నీరజా! నిజం చెప్పు. నాతో జీవితం పంచుకోవటం ఇష్టం లేదా? మ నిద్దరం పెళ్లి చేసుకుందాం. అమ్మ ఒప్పుకుంది. నాకు ఉద్యోగ ముంది. నేను నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను." ఏం మాట్లాడుతున్నాడో తనకే తెలియటం లేదు. హిస్టీరికల్‌గా, ఆవేశంగా మాట్లాడుతున్నాడు.

నీరజ రవిచంద్ర కళ్లల్లోకి చూస్తూ శాంతంగా చెప్పింది. "రవిచంద్రా! మీరు పెద్ద వారు. మనం ఏ నిర్ణయం తీసుకున్నా తులనాత్మకంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. నేను నాన్న గారిని కా దని ఏ పనీ చేయలేను. నా కేం కావాలో, నే నేం చేస్తే సుఖంగా ఉంటానో నాన్న గారికే బాగా తెలును. మన పరిచయాన్ని ఒక అందమైన అనుభవంలా మిగిలిపోనీండి. మనం అనుకున్న వన్నీ అనుకున్నట్టుగా జరిగి, కోరుకున్న వన్నీ దొరికే టట్టయితే ఇది జీవితం కాదు."

తన హ్యాండ్ బాగులోంచి పెళ్లి పత్రిక తీసి రవిచంద్ర చేతి కిచ్చింది. రవిచంద్రకు పిచ్చి పట్టి నట్టుంది. చేతిలోని శుభలేఖ వైపు వెర్రిగా చూశాడు. కవర్ మీద 'నీరజ వెడ్స్ మోహన్‌రావు' అని రాసి ఉంది. ఆ సమాచారం అతను జీర్ణించుకునేలోగా, తన కంట్లో ఉబికే నీళ్లని రవి గమనించకుండా త్వరత్వరగా వెళ్లిపోయింది ఆమె.

రవిచంద్ర చేతిలో కార్డు పట్టుకుని నిలబడిపోయాడు. అతనికి విద్యుద్ఘాతం తగిలి నట్టుంది. ఒ క్షణం అదో వింత భావన - లోక మంతా నిశ్శబ్దమై శూన్యమై పోయింది.


రవిచంద్రకు బ్రతకా లనిపించటం లేదు. ఎందుకో కసిగా అనిపిస్తున్నది. ఎవరి మీదో కసి. ఏదో చెయ్యాలని కసి. ఎవరి నేం చెయ్యాలో తెలియటం లేదు. దారిలో కనబడ్డ ప్రతి వ్యక్తినీ తన్నా లనిపిస్తున్నది. వెళ్తున్న బస్సుల మీదకి రాళ్లు రువ్వా లనిపిస్తున్నది. జుట్టు పీక్కుంటూ గట్టిగా నవ్వాలని, కాళ్లు కొట్టుకుంటూ ఏడవాలని ఉంది. అతనికున్న చివరి ఆశ కూడా పోయింది. నీరజ ఎంత మోసం చేసింది! అంత ఆలోచించ గలిగి, తెలివి ఉన్న వ్యక్తి, నాలుగు లక్షలు కట్న మిచ్చి, ముక్కూ మొహం తెలియని వ్యక్తికి తనని తాను సమర్పించుకోటానికి సిద్ధపడింది. నాన్న మాట కా దనలేక తనని బలి పశువును చేసింది!

ఇంటి కెళ్లాడు. ఇంట్లో ఎవ్వరూ లేరు. అమ్మ ఆఫీసు కెళ్లింది. మళ్లీ నీరజ ఆలోచనలు చుట్టు ముట్టాయి. 'నాన్న గారికి ఏది ఇష్టమైతే తనకూ అదే ఇష్ట మట. వాళ్ల నాన్నకు ఇష్టమయ్యే తనతో లంచ్ పంచుకుందా! వాళ్ల నాన్నని అడిగే తనని ఇంటికి ర మ్మందా?'.

రవిచంద్రకు కసి పెరిగిపోతోంది. గదిలోని కుర్చీని వొక్క తన్ను తన్నాడు. అద్దం విసిరికొట్టాడు. అద్దం పెద్ద శబ్దంతో విరిగి ముక్క లవుతుంటే ఎంతో ఆనందంగా అనిపించింది. 'ఇంజనీరే కావా లట. వా డొట్టి వెధవ కావాలి. వాడు తాగుబోతు, తిరుగుబోతు కావాలి' ఆ భావంతో పైశాచికా నందాన్ని అనుభవించాడు.

కానీ అంతలోనే మరో ఆలోచన. 'అందువల్ల తన కేం లాభం? నీరజ కష్టపడుతూంటే తను భరించ గలడా? అసలు నీరజ లేని బ్రతుకును తను ఊహించ గలడా?' నీరజ ఇక పరాయి వ్యక్తి అన్న భావన భరించ లేనంత బాధను కలుగ జేస్తున్నది. కడుపులో మంట; గుండెలో నొప్పి లాంటిది బయలుదేరింది.

"ఈ బాధ తన ఒక్కడికేనా? నీరజకు లేదా? ఎంత సులభంగా చెప్పింది నాన్న గారి ఇష్టమే తన ఇష్టమని. కవులు స్త్రీని దీపంతోను, పురుషుడిని దీపం పురుగుతోనూ పోల్చటం ఎంత సమంజసం!




ఆలోచించిన కొద్దీ ఆవేశం అవధులు దాటుతోంది. నీరజ సాహచర్యం లేని బ్రతుకు, భవిష్యత్తు శూన్యంగా అనిపించాయి. ఇక తను బ్రతకలే నన్న నిర్ణయానికి వచ్చాడు. నీరజ మీద కసి తీర్చుకోవాలంటే ఒక్కటే మార్గం తోస్తున్నది.

టేబిల్ సొరుగులో వెతికాడు. నిద్ర మాత్రలు దొరికాయి. అమ్మ వాడేవి అవి. దాదాపుగా పది ఉన్నాయి. అన్నీ తీసుకుని తన గదిలోకి వెళ్లాడు. గ్లాసులో నీళ్లు తెచ్చుకున్నాడు. మాత్రలను వాటి రేపర్ల నుంచి వేరు చేసి రేపర్లను అవతలికి విసిరేశాడు. ఇక రేపటి నుంచి అసలు బాధ లేమీ ఉండవు. ఒక తెల్ల కాగితం మీద తన మరణానికి ఎవరూ కారణం కాదని రాశాడు.


తపస్సు లాంటి ఏకాగ్రతతో ఒక్కొక్క మాత్ర వేసుకున్నాడు. ఒ క్కో మాత్ర లోపలకు వెళ్తుంటే నీరజ మీద కసి తీర్చుకుంటున్న భావన కలుగుతోంది. ఎంతో హాయిగా, మనశ్శాంతిగా అనిపించింది. మత్తుగా ఉంది. మంచం మీద పక్క సరిచేస్తున్నప్పుడు కృష్ణశాస్త్రి కవిత గు ర్తొచ్చి నవ్వుకున్నాడు. 'నా మరణ శయ్య పరచుకొన్నాను నేనే! నేనే నాకు వీడ్కోలు విన్పించాను' అనుకున్నాడు.

"జీవితం చిత్రంగా ఉంది. జీవితం అర్థ విహీనం అనిపించింది. మనిషి పుట్టటం ఎందుకు? పుట్టిన తరువాత అనుక్షణం పోరాటం జరుపుతూ, ఆశలను పెంచుకుంటూ, కొన్నిటిని తీర్చుకుంటూ, తీరని వాటి గురించి చింతిస్తూ ఇలా ఈ ప్రస్థానం ఎన్ని రోజులు? ఈ ప్రయాణం గమ్యం ఏమిటి?

"తన పిచ్చి గానీ నీరజతో పె ళ్లయినా ఆనందం ఏముంది? రోజూ సమస్యలే ఉంటాయి. పిల్లలు, వాళ్ల చదువులు, పిల్లల కోరికలు అవి తన ఇష్టానికి వ్యతిరేకా లయితే ఘర్షణ... అహ్... జీవితా నికి అసలు అర్థం లేదు. తన కయితే ఈ బాధ లన్నీ ఉండవు."

ఎంతో హాయిగా ఉంది. శరీరం తేలికయి పోయింది. 'త నిప్పుడు తన శరీరాన్ని వదలి ఆకాశం వైపు ప్రయాణం చేస్తున్నా డన్నమాట. దేవుడిని కలిస్తే అస లీ ప్రపంచం సృష్టించటంలో ఆయన ఉద్దేశ్యం ఏమిటో కనుక్కోవాలి ఈ జీవితా లకు అర్థం ఏమిటో కనుక్కోవాలి.' అనుకుంటూండగా స్పృహ తప్పింది.

రవిచంద్ర పూర్తిగా కోలుకునే సరికి నెల పట్టింది. ఇంట్లో ఉన్న బంధువుల ద్వారా, వచ్చిపోయే మిత్రుల ద్వారా జరిగిన విషయాలు గ్రహించాడు. మాత్రల ప్రభావం మొద లయ్యే సమయానికి అమ్మ ఇంటికి రావటంతో, సరయిన సమయానికి వైద్య సహాయం అందటంతో బ్రతికి బయట పడ్డాడు.




రవిచంద్రకు సిగ్గుగా అనిపించింది. మరో పక్క కోపంగా ఉంది. 'తన బ్రతుకు మీద తన కెటువంటి అధికారం లేదా? తన కిష్టమైన పని చేసే హక్కు తనకి లేదా?'

బంధువు లొక్క రొక్కరే వెళ్లిపోతూంటే రవిచంద్రకు దిగులుగా అనిపించింది. అందరూ వెళ్లిపోయిన తరువాత ఇంట్లో తను, అమ్మ ఇద్దరే మిగిలారు. కాదు... తనతోపాటు నీరజ ఆలోచనలు, జ్ఞాపకాలు మిగిలాయి.

ఓ రోజు సాయంత్రం సరోజినీ దేవి రవిచంద్రని అడిగింది. 'ఆఫీసు కెప్పుడు వెళ్తున్నా' వని.

రవిచంద్రకు ఆఫీసుకి వెళ్లా లనిలేదు. ఆఫీసు గుర్తుకు వస్తే నీరజ గుర్తుకు వస్తుంది. "నా కింక ఆ ఉద్యోగం చేయాలని లే దమ్మా" అన్నాడు.

"ఎందుకని?" చదువుతున్న పేపరు పక్కన పెట్టి అడిగింది.

రవిచంద్ర ఏమీ మాట్లాడలేదు. విసురుగా వెళ్లిపో బోయాడు.

"రవీ! ఇలారా!" కటువుగా పిలిచింది సరోజినీ దేవి.

ఆగాడు రవి. "ఇలా వచ్చి కూచో, నీతో కొన్ని విషయాలు ఎన్నో రోజులుగా మాట్లాడా లనుకుంటున్నాను" అంది.

రవి వచ్చి ఆమె కెదురుగా కూచున్నాడు.

"రవీ! మనిషికి బ్రతికే అవకాశం ఒకే సారి లభిస్తుంది. ఆ ఒక్క సారి కూడా మనిషి మనిషిలాగా బ్రతికే ప్రయత్నం చేయాలి. వెనక్కు తిరిగి చూసుకుంటే సిగ్గుతో తలవంచుకునేట్టు చేసే పనులు చేయకూడదు. మీ నాన్న గారు పోయినప్పటి నుంచీ నిన్ను కంటి రెప్పలా కాపాడుతూ పోషించాను. పెంచి పెద్ద చేశాను.

నిన్ను నవమాసాలు మోసి, నా రక్త మాంసాలు పంచి ఇచ్చాను. నీ అభ్యున్నతే నా ఆశయంగా, నీ ఆనందమే నా ఊపిరిగా బ్రతికాను. నీ కాలికి ముల్లు గుచ్చుకుంటే విలవిల లాడిపోయాను. నీ కేదైనా విచారం కలిగితే నేను రోదించాను. నువ్వే నా బ్రతుకుగా, నువ్వే నా కంట్లో వెలుగుగా భావించాను. నా జీవితంలో ప్రతి క్షణం నువ్వు ఒక ఉన్నత స్థానం సంపాదించాలని, ఉత్తమ వ్యక్తిగా నిలబడాలని ఆశించాను. నీ కోసం నా తాపత్రయ మంతా ఎందుకు? ని న్నింత వాడిని చేసి నీ కో వ్యక్తిత్వం ఇచ్చింది ఎందుకు? పరిచయమై పది నెలలు కూడా కాని అమ్మాయి, నిన్ను కాదని వేరే ఎవరినో పెళ్లి చేసుకుంటే భరించలేక నిండు జీవితాన్ని బూడిద చేసుకోటానికా? ఆత్మహత్య చేసుకోటానికా?"

రవిచంద్ర తల వంచుకున్నాడు.

"అత్యుత్తమమైన, అమూల్యమైన మనిషి జన్మని ఇలా చే జార్చుకుంటావా? అసలు నీ కా ఆలోచన ఎలా వచ్చింది? నేను నిన్ను ఆదర్శంగా పెంచా ననుకున్నాను. ఏనాడూ నీ కోరికలు కాదన లేదు. నీ మార్గానికి అడ్డు రాలేదు. కానీ ఈనాడు నిన్ను చూస్తే నా పెంపకంలో ఏదో లోపం ఉన్న దనిపిస్తోంది."

రవి కళ్ల నిండా నీళ్లు నిండాయి.

"అందరిలా కాకుండా నీకు చిన్నప్పటి నుంచీ వైదిక, ఉపనిషద్వాఙ్మయంపై జిజ్ఞాస కలిగించిం దెందుకు? ఈ తరంలో వా రందరిలా కాకుండా జీవిత మంటే, ప్రపంచ మంటే నీకు అవగాహన కలిగి విచక్షణతో నీ జీవితాన్ని కర్తవ్య నిర్వహణలో గడుపుతా వన్న 'దురాశ'తో. నీకు దగ్గరుండి వేద విజ్ఞానం అందేటట్లు చేశాను. ఉపనిషత్తులు, భగవద్గీత బోధించాను. ఆ జ్ఞాన మంతా ఏమయింది? ఒక యువతిపై జనించిన వాంఛా ప్రభంజనంలో కొట్టుకుపోయిందా? అంత తేలికనా నేను నేర్పిన జ్ఞానం?

"ఈశోప నిషత్తు ''జిజీవిషేచ్ఛతం సమాః' అని నిర్దేశించింది. అంటే అయాచితంగా, సృష్టిలో కెల్లా ఉత్తమమైన మానవ జన్మ నీకు లభించింది. దాన్ని ద్వేషించకు. ప్రేమించు. ఆత్మజ్ఞాన సాధనలో నిమగ్నుడై మనిషి తనకు ప్రకృతి నిర్ణయించిన శతాయుర్దాయాన్ని సత్కర్మలతో, నిర్దిష్ట కర్తవ్య నిర్వహణలో గడపాలి కాని జీవితం నుంచి వేళ కాని వేళలో తప్పించుకోవాలని ప్రయత్నించ కూడదు. అందుకే నువ్వు చేసిన పనిని. ఆత్మహత్యా ప్రయత్నం అంటారు.

"నీకు నీరజ పరిచయమై సంవత్సరం కూడా కాలేదు. నువ్వు పుట్టి నప్పటి నుంచి నాతో నీకు అనుబంధం ఉంది. అటువంటిది నీరజ దూరమైతేనే నువ్వు భరించలేక పోయావు. నువ్వు దూర మవటాన్ని నేన్ను భరించ గలనా? నా ఆలోచన నీ కసలు రాలేదా? అంటే మన అనుబంధం, సంబంధం అంతా ఉట్టిదేనా? లేక నీ మీదే ఆశలు పెట్టుకుని, నీ మీదే ప్రాణాలు నిలుపుకున్న నేను పిచ్చిదాన్నా?"

రవిచంద్ర కే మనాలో తోచలేదు. 'నిజం! ఇన్నేళ్లుగా అమ్మతో తనకున్న అనుబంధం కంటే నీరజతో తన సంబంధం గొప్పదా?'

"నువ్వు పెద్ద వాడివి. నీకు విచక్షణా జ్ఞానం ఉంది. నీ కేం కావాలో నువ్వు నిర్ణయించుకో గలవు. ఇప్పుడు నీ మీద నా కెటువంటి అధికారం లేదు. నీ బ్రతుకు నువ్వు బ్రతక గలవు. కానీ నిన్ను కని, పెంచి, పెద్ద చేసినందుకు, ఇంకా నీకు జీవిత మంటే అవగాహన రాలే దనిపించినందుకు, నీకు కొన్ని విషయాలు చెప్పటం నా బాధ్యతగా అనిపించి చెప్తున్నాను. విని అర్థం చేసుకుని ఆచరిస్తే సంతోషం. లేకపోతే విచారం మాత్రం లేదు."

రవిచంద్ర వైపు నిశితంగా చూసింది సరోజినీ దేవి. ఆమె కళ్లల్లోకి

నూటిగా చూడలేక తల వంచుకున్నాడు రవిచంద్ర.

"నాకు ఆత్మహత్య చేసుకునే పిరికి వా ళ్లంటే పరమ అసహ్యం! అందులోనూ ఈ ప్రేమ వైఫల్యాల వల్ల నయితే మరీనూ! ఆత్మహత్య ద్వారా ఎవరి మీద కసి తీర్చుకుందా మనుకున్నావు? నీరజ మీదనా? నా మీదనా? పొరుగు వాడి మీద కోపంతో తన ఇంటిని కాల్చుకు న్నట్టుంది నీ పని. కళ్లు పోయినా, కాళ్లు పోయినా, తినటానికి సరిగా తిండి లేకపోయినా అనుక్షణం జీవితంతో పోరాడుతూ ఎంత మంది బ్రతకటం లేదు? నీకు అటువంటి సమస్య లే మయినా ఉన్నాయా?

"ఒక్క సారి బయట కెళ్లి కళ్లు తెరచుకు చూడు. బ్రతు కనేది ఎంత భయంకరంగా ఉంటుందో తెలుస్తుంది. మీరు చాయ్‌లు తాగే హోటళ్లలో కప్పులు కడిగే కుర్రాళ్లు, కాఫీ లందించే కుర్రాళ్ల లాగా ఏనా డయినా నువ్వు బాధలను భరించావా? వీధిలో చెత్త పేపర్లేరుకుని అమ్మగా వచ్చిన డబ్బు తాగటానికి తండ్రి తన్ని లాక్కెళ్తుంటే ఆకలితో కడుపు పట్టుకుని ఏనా డయినా ఏడ్చే పరిస్థితి కలిగిందా నీకు? రోడ్ల మీద చూడు! ఎంత మంది చిన్న పిల్లలు ఎంత దయనీయంగా బ్రతుకున్నారు? అసలు వాళ్లు మనుమల్లాగా బ్రతుకుతున్నారా అనిపిస్తుంది. నీకు అటువంటి బాధ లున్నాయా? భయంకరమైన సమస్య లున్నాయా? ఎందుకు బ్రతకలేవు? జీవితంలో ఒక్క ఎదురు దెబ్బకే క్రుంగిపోకూడదు. జీవితాన్ని సవాలుగా తీసుకోవాలి.

"అసలు నీకు ప్రే మంటే• తెలుసా? ప్రేమ అంటే ఎదురుదెబ్బ తగలగానే తాగుడులో పడి, విషాద గీతాలు పాడటం, లేకపోతే గడ్డం పెంచి శాలువా కప్పుకొని విషం మింగి చావటం కాదు. ఒక్క క్షణంలోనో, ఒక్క సంవత్సరంలోనో కలిగేది కాదు ప్రేమ. ప్రేమ వ్యక్తులలో ఔన్నత్యాన్ని వెలికి తెస్తుంది. అంతే కానీ మనిషిని పశువుగా చేసేది ప్రేమ కాదు. మనిషిలో జీవితంపై విరక్తి కలిగించేదీ ప్రేమ కాదు. అది ఉన్మాదం, వాంఛ తప్ప ప్రేమ అనే ఉత్తమ భావన కాదు. మీ నాన్న గారు పోయిన తరువాత కూడా నేను బ్రతికే ఉన్నాను. అంటే మీ నాన్న గారి పట్ల నాకు ప్రేమ లేదా?

"నీరజ లేకపోతే నిజంగా నువ్వు బ్రతకలేవా? ఆమె లేని జీవితం శూన్యమేనా? నీ భవిష్యత్తు అంధకారమేనా? అయినా జీవితంలో నీరజ తప్పించి, ప్రేమ తప్పించి ఇం కేమీ లేవా? ఇంత చదువు, విజ్ఞానం ఉన్న, నీకూ, ఇంకా చదువు పూర్తి కాకుండానే ఆకర్షణనే ప్రేమ అనుకుని జీవితాలు నాశనం చేసుకునే ఇతర యువకులకు తేడా ఏమిటి?

"ప్రతి వ్యక్తీ త నెందుకు పుట్టాడు? తన గమ్యం ఏమిటి? తన లక్ష్యం ఏమిటి? తన కర్తవ్య మేమిటి? తన బాధ్యత లేమిటి? తన ధర్మ మేమిటి? అన్న విషయాలు తెలుసుకుని అందుకు అనుగుణంగా జీవించాలి కానీ ఇ దేమిటి? ఇన్నేళ్లు సంపాదించిన విజ్ఞానం, చేసిన పరిశ్రమ, పెంచుకున్న ఆశలు, ఆశయాలు; ఏర్పరచుకున్న ఆదర్శాలు అన్నీ ఒక అమ్మాయిముందు బలాదూరేనా? మొత్తం జీవితం ఒక భావన కన్నా విలువైనది కాదా?

"అటు చూడు! ప్రపంచంలో ఎన్ని బాధ లున్నాయి! ఎంత అన్యాయ ముంది! మనుమ లెంత హీనంగా బ్రతుకుతున్నారు! మనుమలు ఎంత నీచంగా మారుతున్నారు! అమాయకులను తెలివైన వారు, బలహీనులను బలవంతులు ఎంత క్రూరంగా హింసిస్తున్నారో గమనించావా? మతం పేరిట, కులం పేరిట, రాజకీయాల పేరిట మనిషిని ఏ రకంగా పశువులా మారుస్తున్నారో గమనించావా? మనిషి ప్రాణానికి, మానానికి మించి కాగితపు ముక్క లెంత విలువ పొందుతున్నాయో చూశావా! సాటి మనిషి దుస్థితి నీకు పట్ట లేదా? ఇవన్నీ నీకు ముఖ్యం కావా? లోకంలోని అశాంతి, ఆకలి, ఆవేదన, అన్యాయం ప్రేమ నిండిన నీ కళ్లకి కనిపించవేమో?

"పతన మవుతున్న నైతిక విలువలు, కూలిపోతున్న సామాజిక జీవనం ఇ వేవీ నీకు పట్టవేమో! విశ్వనాథ అభిమానివి కదా నువ్వు? మారుతున్న సాంఘిక, సామాజిక, నైతిక విలువల పట్ల ఆయన ఆవేదన నీకు అర్థం కాలేదా? అర్థ మయినా నా కెందుకు అని పట్టనట్టు ఊరుకున్నావా? ఒక వ్యక్తిని ఆరాధించట మంటే ఆయన పుస్తకాలు కొని పూజించటం కాదు, ఆయన ఆదర్శాలు చూపే వెలుగులో నీ బాటలో లక్ష్య సాధనకు సాగిపోవాలి. నీకు అసలు లక్ష్య మంటూ ఉంటే కదా! ఇ దంతా నీ కెందుకు చెవుతున్నా నంటే ఆలోచన లేని వారు ఎలాగూ పనికిరారు. ఆలోచన లుండి, సున్నిత భావా లుండి కూడా నీ లాంటి వాళ్లు ఎందుకూ పనికి రాకుండా పోతున్నా రన్న బాధ వల్ల.

"కళ్లు తెరచి ప్రపంచాన్ని గమనించు. చేత నయితే నువ్వు చేయ గలిగింది చెయ్యి. ఒకే వ్యక్తి మీద కేంద్రీకృతమైన నీ సంకుచిత ప్రేమని విశాల విశ్వంలోని మానవాళి వైపు మళ్లించు. ఒకే ఆత్మకు పరిమితమైన నీ ప్రేమను విశ్వాత్మ వైపు మళ్లించు. నీకు ఓ.ఎన్.జి.సి. నుంచి సెలక్టు చేసినట్టు ఉత్తరం వచ్చింది. వెళ్లి చేరి బుద్ధిగా ఉద్యోగం చేసుకో. ప్రపంచం అంటే ఏమిటో తెలుసుకో! సమాజానికి నీ వంతు బాధ్యత సక్రమంగా, నిర్వర్తించు. నీ జీవితానికి అర్థం ఈ లోకంలోనే వెతుక్కో!

"నీ కిం కో విషయం చెప్తున్నాను. యువతీ యువకుల మధ్య ఆకర్షణ సహజం. వారు రోజూ కలవటం తటస్థిస్తే పరస్ప రాకర్షణను ప్రణయంగా భావించటం కూడా అంతే సహజం. కానీ ఆ ప్రణయం వ్యామోహం కా కూడదు. నీరజ నీ మీద ప్రేమను బహిర్గతం చేయకపోవటానికి కారణం నాన్న గారికి భయపడి కాదు. మన సమాజంలో స్త్రీకి రక్షణ, గౌరవం పుట్టి నింటిలోనూ, మెట్టి నింటిలోనూ మాత్రమే లభిస్తాయి. అందు కనే ఆమె నాన్న గారి అండను వదులుకోటానికి ఇష్టపడలేదు. ఆమెకు నీ మీద ఏర్పడిన ప్రేమ కన్నా నాన్న గారి మీద అభిమానం ఎక్కువ. నీరజ ప్రాక్టికల్‌గా ఆలోచించింది. అంతే కానీ పిరికిది కాదు. నిన్ను మోసం చెయ్యలేదు. నీకు నువ్వే మోసం చేసుకుంటున్నావు. అన్యాయం చేసుకుంటున్నావు. ఆకర్షణకి, ప్రేమకు, నిజ జీవితానికీ కల వ్యత్యాసం గుర్తించి మనిషిగా నిలబడు. నువ్వు సాధించలేనిది నీ తరువాత తరం వాళ్లు సాధించేట్టు చెయ్యి. అంతే కానీ ఒక అమూల్యమైన వరాన్ని అర్థం లేని విషయాల వెంట పడి అన్యాయం చేయకు."

సరోజినీ దేవి వెళ్లిపోయిన చాలా సేపటి వరకు రవిచంద్ర నిశ్శబ్దంలో చేతుల్లో మొహం దాచుకుని కూచుండిపోయాడు. ఫాన్ గాలికి టేబిల్ మీద రెపరెప లాడుతుంటే తీసి చూశాడు. ఓఎన్‌జిసి అపాయింట్‌మెంట్ ఆర్డరు, పక్కనే భగవద్గీత కనిపించాయి.

ఆ నిశ్శబ్దంలో హఠాత్తుగా అతనికి చిన్నప్పుడు అమ్మ వల్లెవేయించిన భగవద్గీతలోని శ్లోకం గుర్తుకు వచ్చింది. అది చెవుల్లో మార్మోగ సాగింది.

'ఇతితే జ్ఞాన మాఖ్యాతం
గుహ్యాద్గుతరం మయా!
విమృశ్యైత దశేషణ
యథేచ్ఛసి తథా కురు!'

[ఇట్లు రహస్యాతి రహస్య మగు జ్ఞానము నీకు వివరింప బడినది. దీనిని పూర్తిగ విమర్శించి నీ కెట్లు తోచిన అట్లు చేయుము.]

** ** ** ** **

కరతాళ ధ్వనులు మి న్నంటాయి. రవిచంద్ర లేచాడు. అతని కళ్ల నిండా నీ ళ్లున్నాయి. "నాన్న గారూ! వేదిక పైకి రండి. నా ఈ ఆనందాన్ని నాతో పంచుకోండి." వేదికపై నుండి పిలుస్తోంది రవిచంద్ర కూతురు నీరజ. నీరజ, ఆమె తండ్రి రవిచంద్రలను వేదికపై చూసి ఆనందించని వారు లేరు. అయితే వేదిక పైకెళ్తూ రవిచంద్ర మాటి మాటికీ ఆకాశం వైపు నమస్కారాలు పెడుతూ కళ్ల నీళ్లు తుడుచుకోవటం గమనించిన వా రెవరికీ అర్థం కాలేదు ఆయన అలా ఎందుకు చేస్తున్నాడో!

డిసెంబరు నెల
'కథాప్రభ'లో
ఎ. అప్పల్నాయుడు
రచన
'గయిరమ్మ'